మర్యాదపూర్వక కలయిక



టీపీసీసీ అధ్యక్షుడిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ప్రజాభవన్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడిగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే గెలుపు అని ధీమా వ్యక్తం చేశారు.

9, 10 న తాగునీటి సరఫరా బంద్

చింతల్ : హైదరాబాద్‌కు తాగునీటిని సరఫరా చేసే గోదావరి ఫేస్-1 ప్రాజెక్ట్ పైప్‌లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 9, 10 న కుత్బుల్లాపూర్ డివిజన్ వ్యాప్తంగా తాగునీటి సరఫరా ఉండదని జీఎం మాధవి 'సాక్షి'కి తెలిపారు. గోదావరి పైపులైను మూర్మూర్, మల్లారం, కొండపాక పంపింగ్ స్టేషన్లలో 3000 ఎంఎం డయా పంపింగ్ మెయిన్ పైపులైన్ పై వాల్వుల మరమ్మతుల కోసం 9న ఉదయం 6 నుంచి 10 వ తేదీ ఉదయం 11 వరకు నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. జగద్గిరిగుట్ట, షాపూర్‌నగర్, సూరారం, జీడిమెట్ల, అల్వాల్ రిజర్వాయర్ల పరిధిలోకి వచ్చే అన్ని కాలనీలు, బస్తీలతో పాటు బల్క్ సప్లై కూడా నిలిచిపోతాయని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. మరమ్మతులు పూర్తయిన తర్వాత 11న సాయంత్రంలోగా నీటి సరఫరా చేసే అవకాశం ఉందని తెలిపారు.

8 లీటర్ల సారా పట్టివేత

కుత్బుల్లాపూర్: గుడుంబా తయారీ కేంద్రంపై పోలీసులు దాడులు చేసి 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ లాస్ట్ బస్టాప్ సమీపంలో ఓ ఇంట్లో గుడుంబా తయారు చేస్తున్నారని సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ ఏఎస్ఐ రవీందర్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించారు. ముదావత్ నీలా (35) అనే మహిళ ప్లాస్టిక్ డబ్బాలో భద్రపరిచిన 8 లీటర్ల సారా, కుండలో ఉంచిన 2 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. సదరు మహిళపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సూచించారు. రంగధాముని చెరువు వద్ద ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే దాదాపు 14 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తయిందన్నారు. అధికారులు కూడా ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్, తాగునీరు, విద్యుత్, క్రేన్లకు సంబంధించిన ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సతీశ్ అరోరా, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



రాయదుర్గం: అంతర్ పాఠశాలల రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థిని సత్తా చాటారు. క్యాంపస్ స్కూల్‌లో 6వ తరగతి చదివే హన్సిని యోగాసనాలు వేస్తూ తన ప్రతిభ చాటడంతో అంతర్‌పాఠశాలల పోటీల్లో రెండవ స్థానం పొందారు. ఆమె రంగారెడ్డిజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. రకరకాల యోగా విన్యాసాలు చేస్తూ తనదైన శైలిలో యోగాసనాలు హన్సిని వేసింది. ఆమెను క్యాంపస్ స్కూల్ ప్రిన్సిపాల్ మురళి, యోగా కోచ్ సతీశ్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఆమెకు మెడల్, సర్టిఫికెట్‌ను అందించారు.

ప్రత్యేక పూజలు



మార్కేండేయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూజల్లో ఉదయ్ గంజి మిత్రబృందం



ఎం.ఎస్.రెడ్డినగర్ రోడ్డు నంబర్- 17లో పూజల్లో మహిళలు



చింతల్ శ్రీనివాస్‌నగర్‌లో కోలాటం ఆడుతున్న మహిళలు



సుచిత్రలోని టీఎస్ఆర్ నార్త్ సిటీ పూజల్లో ఎంపీ ఈటల రాజేందర్

వినాయకా.. వీడ్కోలిక

- ముగిసిన నవరాత్రులు
- గంగమ్మ.. ఒడికి చేరిన గణనాథుడు
- వైభవంగా నిమజ్జన శోభాయాత్ర
- లడ్డూల వేలానికి తీవ్ర పోటీ



వెన్నెలగడ్డ ఎన్నా చెరువులో గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



సూరారం కట్టమైసమ్మ చెరువులో..

కుత్బుల్లాపూర్: నియోజకవర్గవ్యాప్తంగా శనివారం గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుండి సాయంత్రం వరకు వందలాది వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చాయి.

◆ బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి పర్యవేక్షణలో ముగ్గురు ఏసీపీలు, ఐదుగురు సీఐలు, 16 మంది ఎస్ఐలు ప్రత్యేకంగా 200 మందికి పైగా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్లకు అనుసంధానంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ముందుకు సాగారు.

◆ కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి లు ఆయా ప్రాంతాల్లోని చెరువులను సందర్శించి నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు లక్ష్మీగణేశ్, కిష్టప్పతో మాట్లాడారు. అర్ధరాత్రి వరకు కొనసాగే నిమజ్జనం పూర్తయ్యే వరకు విధుల్లో ఉండాలని ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. రాత్రి వరకు కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 6,369 విగ్రహాలు, గాజులరామారం సర్కిల్ పరిధిలో 8,200 విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లినట్లు చివరి రోజు శనివారం మొత్తం 4,000 పైగా చిన్న, పెద్ద విగ్రహాలు నిమజ్జనం చేశామని తెలిపారు. అదేవిధంగా కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఎస్సీ చిన్నారెడ్డి తదితరులు పలు చెరువులను సందర్శించారు.

◆ జంట సర్కిళ్ల పరిధిలో పరికి చెరువు, సూరారం చెరువు, వెన్నెలగడ్డ ఎన్నా చెరువు ప్రాంతాలతో పాటు హెచ్ఎంటీ పైప్‌లైన్ రోడ్ లో రెండు తాత్కాలిక నిమజ్జన కోనేరులు, మరొకటి మున్సిపల్ కార్యాలయం పక్కనే ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రత్యేక క్రేన్లను ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను రంగంలోకి దించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ వాటర్ వర్క్స్ అధికారులు ఆయా ప్రాంతాల్లో ఊరేగింపుగా వచ్చే వారికి తాగునీటి ప్యాకెట్లను అందజేశారు.

◆ నిమజ్జనం సందర్భంగా జంట సర్కిళ్ల పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సూరారం లింగం చెరువు వద్ద పరిస్థితిని గుర్తించి బాలానగర్ వైపు వెళ్లే వాహనాలు బహదూర్‌పల్లి మీదుగా కొంపల్లి నుంచి వెళ్లేలా చర్యలు చేపట్టారు. అదేవిధంగా గండి మైసమ్మకు వెళ్లే వాహనాలు సూరారం మీదుగా మళ్లించినట్లు జీడిమెట్ల సీఐ శ్రీనివాస్ తెలిపారు.



వెన్నెలగడ్డ ఎన్నా చెరువు వద్ద ఉప కమిషనర్ నర్సింహ, అధికారులు



నిమజ్జనానికి గణనాథులను తీసుకువెళ్తున్న చిన్నారులు



వాహనదారులకు తాగునీటి ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న కుత్బుల్లాపూర్ జీఎం మాధవి



సూరారం కట్టమైసమ్మ చెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఎస్ఈ చిన్నారెడ్డి

లడ్డూ అధరహో



బాచుపల్లిలో లడ్డూ వేలంలో ఎమ్మెల్యే వివేకానంద్



భౌరంపేట్‌లో సర్గారి రాజిరెడ్డి (రూ. 10.21 లక్షలు)



మల్లంపేట్‌లో దప్పు రాము) (రూ.4.20 లక్షలు)



కేకే ఎన్‌క్లేవ్‌లో గుర్రం బ్రదర్స్ బుల్లి, రామకృష్ణ (రూ.1.75 లక్షలు)



అనిల్‌కుమార్‌చారి (రూ.1.52,116)



బాచుపల్లిలో కమ్మెట రాకేశ్ (రూ.2.72 లక్షలు)



దూలపల్లిలో టీమ్ బ్రదర్స్ (రూ.5.04 లక్షలు)



రంగారెడ్డినగర్ వెంకటేశ్ (రూ.1.90 లక్షలు)

'హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం'



సదస్సులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

కుత్బుల్లాపూర్: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్‌మాదిగ అన్నారు. షాపూర్‌నగర్ ఎంజీ ఫంక్షన్ హాల్‌లో పింఛన్‌దారుల సన్నాహక సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ. 6 వేలు, ఒంటరి మహిళలు, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తి కావస్తున్నా ఇంకా అమలు చేయడం లేదన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే సదస్సుకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని, పింఛన్‌దారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి తమ గళం వినిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళామండలి అధ్యక్షుడు అశోక్‌మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి కేశపాద రామచందర్, జిల్లా కో.ఇన్‌చార్జి అరుణ్ కుమార్ మాదిగ, అధికార ప్రతినిధి శ్రీనివాస్‌మాదిగ, ఉపాధ్యక్షుడు యాదగిరి మాదిగ, రమేశ్ మాదిగ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సలోమి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహం ధ్వంసం!

జీడిమెట్ల: జీడిమెట్ల డిపో దగ్గర తెలంగాణ ఉద్యమ సమయంలో నాయకులు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం రాత్రి జీడిమెట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అదుపుతప్పి తెలంగాణ తల్లి విగ్రహం దిమ్మెను ఢీకొట్టింది. దీంతో విగ్రహం ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నాయకులు పోలే శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, గుబ్బల లక్ష్మీనారాయణ, మహ్మద్ ఇస్మాయిల్ ఈ విషయమై జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఇన్‌స్పెక్టర్, స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ బస్సు యజమానితో మాట్లాడగా త్వరలోనే విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారని వారు తెలిపారు.



డిపో వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దీపావళి కానుకగా జీఎస్టీ సంస్కరణలు

చందానగర్: ప్రజలకు దీపావళి కానుగా ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ సంస్కరణలను అందించిందని హఫీజ్‌పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జితేందర్ పేర్కొన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ మదీనాగూడలో ప్రధాన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంస్కరణలతో ప్రజలకు నిత్యం అవసరమయ్యే వస్తువుల ధరలన్నీ తగ్గించడానికి యత్నించడం అన్ని వర్గాలను సంతోషంలో ముంచెత్తిందన్నారు. ఈ నిర్ణయాన్ని అందరూ స్వాగతిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్‌యాదవ్, అజిత్‌సేనాపతి, రమణయ్య, సత్యనారాయణరాజు, ప్రసాద్‌పాత్రో, రాజు, సురేశ్, శ్రీనివాస్, నర్సింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

బ్లూక్రాస్ ఆధ్వర్యంలో 'యాంటీ రేబిస్ ప్రోగ్రాం'



పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన '100 రోజుల' కార్యక్రమంలో భాగంగా కొంపల్లి పురపాలక సంఘం బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ సహకారంతో శనివారం యాంటీ రేబిస్ ప్రోగ్రాం నిర్వహించారు. కొంపల్లి మున్సిపల్ కృష్ణారెడ్డి, బ్లూ క్రాస్ కొంపల్లి సెంటర్ డైరెక్టర్ ఆర్.ఎస్.కుమారి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొంపల్లి నివాసుల పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రేబిస్ ఫ్రీ తెలంగాణగా మార్చేందుకు ప్రజలు సహకరించాలని, తమ పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ తప్పనిసరిగా వేయించాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జానీ, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రాఘవాచారి, మున్సిపల్ సిబ్బంది, బ్లూక్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ నాలా పనులకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహాయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: శ్రీ సాయి పద్మజా అవెన్యూ కాలనీలో రూ. 28 లక్షల వ్యయంతో చేపట్టిన బాక్స్ నాలా పనులకు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్నాళ్లు వర్షం నీరు ప్రవహించే మార్గం లేక పలు అపార్టుమెంట్లవాసులతో పాటు కాలనీ ప్రజలు నీట మునిగి ఇబ్బందులు పడుతున్న విషయం గ్రహించి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో బాక్స్ నాలాను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈ నిఖిల్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కాలనీవాసులు సుధీర్, సోమేశ్, మధుగౌడ్, శంకర్‌రెడ్డి, సుదీర్‌రెడ్డి, వెంకటరమణరెడ్డి, సుధాకర్, వివేక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజు, శ్రీనివాస్‌గుప్తా, తులసీదాస్, బద్దం బల్వంత్‌రెడ్డి, విక్రమ్, వంశీ కాలనీ మహిళలు పాల్గొన్నారు.